

పాతకం ముహూర్తం సమీపిస్తోంది. వరుడి తండ్రి వజ్రయ్య జాడేలేదు. ఏమయ్యాడు అంటే ఏమయ్యాడు అనుకున్నారు.

"నా నాయనో! అనుకున్నంతపనీ చేశారు. నా కొంపతీశారు దేవుడోయ్" అని వగైరా రాగాలు పెడుతూ వజ్రాంబ దొర్లుతోంది. అందరూ చుట్టూ మూగి వింటున్నారు! ఎవరికేనా ప్రాణం మీదికి వచ్చిందేమోనని పరుగెత్తుకొచ్చిన పక్కిళ్ల వాళ్లు కూడా శ్రద్ధగా వింటున్నారు. ఎవరేం చేసినా వజ్రాంబ ఏడుపు మానలేదు.

అదే సావిట్లో మరోమూల నలుగుర్ని పోగేసుకుని పురోహితుడు ఆట మొదలెట్టాడు కేకలేస్తూ. వజ్రయ్య ఆయనను చూచి మాయం కావటం, పై పెచ్చు వజ్రాంబ శోకించడం ఆయన తట్టుకోలేక పోయాడు. "లక్షణంగానే ఉంది. చివరకు ముడిపడుతుందా అన్నది అనుమానమే—ఈ రోజుల్లో పెళ్లి అయ్యేదాకా నమ్మకం లేదండీ. మొన్న వాన పెళ్లిలో—" అంటూ పెళ్లికి వస్తూ వరుడు పిల్లిని చంకనెత్తుకు రావడం, పీటలమీద అది కూడా కూచుంటుందని మారాం చేయడం, భోజనాలదగ్గర దానికి ఎలకను తెచ్చి వడ్డించమనడం, దాంతో పోట్లాట.... అన్నీ చెప్పుకొచ్చాడు.

కొంతసేపు ఇదంతా చూశాక నలుగురూ సైకిళ్లు తీసుక బయల్దేరారు వజ్రయ్యను వెదకటానికి.

"ఏమైపోయాడు సన్నాసి? వుంత కష్టం పడి నక్కపిల్లిగాని పోలేదు కద!" అన్నాడు వజ్రయ్య అన్నగారు బంగారం. నక్కపిల్లిలో వజ్రయ్యకు గోళ్లు గిల్లుకుంటూ కూర్చోడం నేర్పిన గురువున్నాడు. ఆయన్ను రోజు కోసారి చూడందే నీరు ముట్టడు వజ్రయ్య.

"అబ్బే లేదయ్యా నేను అక్కణ్ణించేగా వస్తూంట. బస్సెక్కి పాలెం ఉడాయించే శాడేమో" అన్నాడు వరహాలు.

"అవునవును. ముందు ఆ సంగతి చూడండి. కొంపతీసి బస్సెక్కాడంటే వాడు మనిషికాదు, ఇహ పట్ట పగ్గాల్లేవు" అన్నారు ఎవరో. పురోహితుడు గుడ్లు పెద్దవిచేసి "ఏం మహానుభావా, పెళ్లి కాస్తా జరగాలని లేదా? నీ శకున పక్షి మాటలు కట్టి పెడతావా?" అన్నాడు కసిగా.

బంగారం అది వినకుండా "అది కుదరదే. బస్సుల వాళ్లందరితోనూ నేను నిన్నే చెప్పాను,



# శ్రీ కట్న లీలలు

జ్యేష్ఠ

ఇల్లు కట్టి చూడు, పెళ్ళి చేసి చూడు అన్నది లోకోక్తి. అన్నీ కుదిరి లక్షణంగా కొడుకు పెళ్ళి అవుతూ ఉండగా సరిగా ముహూర్తం వేళకు మాయమయ్యే తండ్రి ఉంటాడా లోకంలో! ఉంటాడన్నా నమ్ముతుందా ఈ లోకం! అయినా ఆ పెళ్ళి జరిగి తీరాలనుకుంటే అందుకు మళ్ళీ అంత నాటకమూ ఆడవలసి వస్తుంది!

వాణ్ణి, మూడు రోజుల్దాకా బస్సు ఎక్కనీ యొద్దని. వాడి సంగతి నాకు తెలీదూ! తన ఒడుక్కి ఏంచేశాడనుకున్నారు! తీరా ముహూర్తం దగ్గర పడుతూంటే కొబ్బరి చెట్టెక్కి కూర్చున్నాడు. ఇప్పుడు బావి దగ్గర్లేదూ వంకర చెట్టు. దాని ప్రక్కన ఉండేది కొట్టించేశాం—" అని చెప్పసాగాడు.

వజ్రయ్య అలాంటి పనులకు పెట్టింది పేరు. కొడుకు పెళ్లిలో ఇప్పుడూ అదే ఆచారం పాటించాడు.

తన పడుగుకు కొబ్బరి చెట్టెక్కి కూర్చుని దిగమన్నవాళ్లమీద కాయలు విసురుతానని బెదిరించిన వజ్రయ్య, తన కూతురి బారసాలకు పీటలమీద బూటు (ఒక కాలుకే) తొడుక్కొని, కూర్చుంటానని రభస చేసిన వజ్రబాబు దగ్గర బంధువుల కుర్రాడి పెళ్లిలో సరిగ్గా పుస్తె కట్టే వేళకు ఇంటి మెయిన్ స్విచ్ ఆఫ్ చేసి అది ఉన్న గదిలోనే తాళం వేసుక కూర్చున్న వజ్రానందం ఇప్పుడు తనకొడుకు వివాహ మహోత్సవ సందర్భంలో ఏం చేసి ఉంటాడో తెలుసుకోవాలని అందరికీ కుతూహలంగా ఉంది.

వజ్రయ్య లేడు. పెళ్లి ఆగిపోతుందేమో అని బెంగపెట్టుకు నేపాటి అమాయకులు అక్కడ లేరు. అతను ఈసారి చేసిన 'తమాషా' ఏమిటి అన్నది ముఖ్యం అయిపోయింది. వాదోపవాదాలు చురుగ్గా సాగిపోయాయి.

'అసలీ పెళ్లి వాడి కిష్టం లేదు.'

'ఆ పిల్లను తప్ప మరెవర్నీ చేసుకో నన్నాట్టగా.'

'కుర్రాడి మాట కాదయ్యా వజ్రయ్య గురించి నేననేది. కుర్రాడు మోజు పడ్డాడు కాని వజ్రయ్యకు మేనరికం చేయడం నచ్చ లేదు.'

'అదా సంగతి ఓహో—' అందరికీ రహస్యం తెలిసి పోయినట్లైంది. వజ్రయ్య నిర్దోషి అని, మామూలుగానే ప్రతి శుభ కార్యంలోనూ ఏదో ప్రత్యేకమైన తమాషా చేసే మనిషి ఇప్పుడు కొడుక్కు ఇష్టంలేని పెళ్లి జరుగుతూంటే ఇలా మాయం కావటం సమంజసమనీ అందరూ భావించారు.

"మరి ముందు ఎలా మాటిచ్చాడూ? తాంబూలాలు ఇచ్చుకున్నది మొన్నేగా. రేపు సప్తమికి పెం—"

"సరే తప్పు చేయందెవరయ్యా? మనిషన్నాక తప్పు చేస్తాడు. ఇష్టం లేదని అతనికి తాంబూలాలు ఇచ్చాక తెలిసిందేమో" అని చుట్టూచూచి నెమ్మదిగా, "అసలతన్ని బలవంతంమీద ఒప్పించారండీ. అన్నగారి పట్టు!" అన్నాడు వరహాలు.

"పాపం!"

ఇంతలో వజ్రయ్య బావమరిది కన్యాదాత అయిన రత్నాలు జుట్టు పీక్కుని ఆ జుట్టంతా గుప్పిట్లో దాచి తెచ్చి వజ్రాంబ ముందు పడేశాడు. ఆ జుట్టు కాస్త పచ్చగడ్డిలా భగ్గుమంది. "ఇదిటే నువ్వు చేసేపని? పైవాళ్లా పైవాళ్లా అయితే అనుకోవచ్చు. సాక్షాత్తూ మేనకోడలు కదా. దానిపెళ్లి కింత రభస చేస్తావా" అని చెల్లెలి మీద కొప్పడ్డాడు. అతనికీ పాపం మతిపోయినట్లయింది. అందుకే ఎక్కడికో ఉడాయించింది వజ్రయ్య అనీ వజ్రాంబ కాదనీ మరచిపోయి అలా అన్నాడు. వజ్రాంబ చలిం[illegible] ఇం[illegible] గట్టిగా ఏడుస్తూ 'పెళ్లి వంటలు అయ్యా[illegible] లేదో' అని అనుకోసాగింది.

ఇది ఇలా ఉండగా అక్కడ ఆడపెళ్లి వారింట్లో పెద్ద గరిటె కావలసివచ్చి అటక

ఎక్కిన వంట బ్రాహ్మడికి ఏదో కాలిమీద కరచినట్లయింది. ఎలుక అనుకొని "ష్ష్' అని గరిటెలు వెతుకుతుంటే వీపు గోకినట్రాంతి కలిగింది. ఉలిక్కి పడ్డాడు అతడు.

మరో నిమిషం గడిచాక మెడమీద ఎవరో గిల్లడం, అదే సమయంలో చెవిలో 'గుయ్' అనడం జరిగాయి. "బాబోయ్ దెయ్యం!" అని అటకమీంచి ఉరికేశాడు వంట బ్రాహ్మడు.

ఓ అరగంట క్రిందటే అంజనం వేసి వజ్రయ్య ఆచూకి పట్టేందుకు భూతాల బాలధనపతి వచ్చాడు. అతను అంజనంవేసి వజ్రయ్య ముందు తూర్పుగానూ, తరువాత పడమరగానూ ప్రయాణించాడనీ, పాడై పోయిన లారీ అడుగున నిద్రపోతున్న సూచనలు కనిపిస్తున్నాయనీ అంటున్నాడు. 'దెయ్యం' అని వంట బ్రాహ్మడు గొడవ చేయడంతో బాలయ్య ఇప్పుడు తన శక్తులన్నీ ప్రదర్శిస్తే చూడాలని అందరూ ముచ్చట పడ్డారు.

# శ్రీ కట్నలీలలు

'భలే బాగుంది. విందుతో పాటు వింత, వినోదం కలిసొచ్చింది' అని భావించారు.

కాని ఆ దయ్యాన్ని పట్టేందుకు బాలయ్య అట్టే ఉత్సాహం చూపెట్టలేదు. ముక్కు లోకి ఏదో దట్టిస్తూ "ఆ దగ్గరున్న దెయ్యాన్ని పట్టడమూ ఓ గొప్పేనా! దాన్ని ఆరుయోజ నాల దూరంలో ఉండమనండి, నా తడాకా చూపిస్తాను" అన్నాడు.

ఆ దెయ్యం పారిపోలేదు. అటకమీదే ఉందని అందరికీ తెలిసిపోయింది. ఎందుకంటే 'గరిటెలు కావాలి. వంట మాడిపోతోంది" అని వంట బ్రాహ్మలు అటకముందు చిందు లాడుతుంటే రెండు పెద్ద గరిటెలు కాస్తలో వాళ్లకు తగలబోయి పక్కనే పడ్డాయి. అవి దెయ్యం విసరలేదా మరి ?



FSHC. 1/60

దెయ్యం కదలడం లేదు. కనుక తనే ఆరు యోజనాలూపోయి దాన్ని పట్టేస్తా నంటూ దారి తీశాడు బాల ధనపతి. అందరికీ దయ్యాన్ని పట్టడం చూడనైతిమే అని నిరుత్సాహమైంది. పెద్దవాళ్ళు విసుక్కు న్నారు. "ఈరోజుల్లో పెళ్లిళ్ళ ఇంతే. ఓ ముద్దా ముచ్చటా? మారోజుల్లో అయితే— రాజయ్యకు పూనకం వచ్చి ఆడుతూంటే చూడాలి. ఇప్పటి గోపీకృష్ణులు ఎందుకూ పనికిరారు. పదిమంది జెమాజెట్టీలు ఆపితే కాని ఆగేవాడు కాదు—"అంటూ చెప్పుకు పోతున్నారు.

వాళ్ల సరదాల్లో వాళ్ళున్నారు.

రత్నాలు దూరపు బంధువు (అప్పుడే బస్ దిగి వచ్చిన) గిరి ఇదంతా చూచి సంగతేమి టన్నాడు. విని తను అటకెక్కుతానన్నాడు. అందరూ నీకేమైనా పిచ్చా, బతకాలని లేదా అని అడ్డు పెట్టారు. 'నాకు బతకాలనే ఉంది. మీకే పిచ్చి' అంటూ నిచ్చెన ఎక్క బోయి ఎవరో దాన్ని మోసుకపోగా ఎగిరి దూలం అందుకుని గిర్రున తిరిగి అటక మీద వాలాడు గిరి.

అందరివీ జాలిగుండెలే మరి. 'పాతికేళ్ళ లేవు చూస్తే. దెయ్యం జోలికి పోవద్దంటే విన్నాడు కాదు' అంటూ వాపోయారు. ఇంతలో "రా బాబాయ్ నే చెప్తాగా" అన్న గిరి గొంతు వినపడింది. అందరూ విస్తుపోయారు. 'వజ్రయ్య కాదు కదా?' అనుకున్నారు. కాని వెంటనే 'దెయ్యం గిరిని పట్టుకుందనీ, అంచేత అతను అలా పేలుతున్నాడనీ' సరిపెట్టు కున్నారు. మరో రెండు నిమిషాలు దారుణ 'సస్పెన్సు' గడిచాక 'నిచ్చెనలేకుండా ఎలా దిగనురా' అని వజ్రయ్య అడగడం, మరో క్షణంలో అతను అటక అంచుకురావటం జరిగింది.

'అమ్మయ్య వజ్రయ్య!' అన్నారు. నలుగురు నాలుగిళ్లకూపోయి నాలుగు నిచ్చెనలూ, పలు పులూ తెచ్చారు—నిచ్చెనలు వజ్రయ్య దిగ డానికీ, పలుపులు దిగిన వజ్రయ్యను కట్టేయ డానికీ అని. రెండు నిచ్చెనలు విరిగాక మూడో దాని మీద క్షేమంగా దిగాడు వజ్రయ్య.

వజ్రయ్యను మెచ్చుకోని వాళ్ళు లేరు. 'భలే తమాషా చేశావు వజ్రయ్యా' 'ఎంత ఆలోచనో!' 'ఎవ్వరం కలలోనైనా అనుకో లేదు సుమా అటక ఎక్కావని' అని అనేక విధాల ప్రశంసించారు.

వజ్రయ్య తల్లివచ్చి చారెడు ఉప్పు దిగదుడిచి పారేసి 'నాతండ్రీ ఎంతకష్టం వచ్చిందిరా నీకు. ఈ మాయదారిపెళ్లి ఎక్క డొచ్చిందిరా మనకు' అంది.

కాని ఆ తల్లి ప్రేమను ఎవ్వరూ మెచ్చుకో లేదు. కళ్ళు నీళ్ళెట్టుకుంది. అందుబాటైన ప్రతి శుభ కార్యాన్నీ అభాసుచేస్తూ, వజ్రయ్య ఎక్కడ ఎలా ఉండకూడదో సరిగ్గా అలాగే

ఉండడంలాంటి గుణాలన్నీ అతని తల్లి చలవనే వచ్చాయని అందరికీ తెలిసిపోయింది.

వజ్రయ్య దొరికాడని తెలిసి పుంతల్లో, తోపుల్లో, పుట్టల్లో అతన్ని అన్వేషిస్తున్న రత్నాలు కాళ్ళీడ్చుకుంటూ వచ్చాడు. మనిషి వజ్రయ్య మాయమైన రెండు గంటల్లోనూ రెండు నెలలు ఖాయిలా పడినంతగా డీలా పడ్డాడు. కాని 'ఈడొచ్చిన ఆడపిల్ల తండ్రిని కష్టాలు నాక్కాక ఇంకెవరికి' అనే వేదాంత భావం ఆయన మొహానికి కొంచెం తేటు ఇచ్చింది.

"ఏం బావా, అటకమీద బావుందా? నువ్వు ఎక్కుతావని ముందే తెలిస్తే అక్కడ దుమ్ము దులిపించి, ఓ బల్బ్ పెట్టించి చాప చదరా వేసేవాళ్ళంగా? మర్యాద జరగ నందుకు మరేం అనుకోకు" అన్నాడు. అందులో గుంటూరు కారంలాంటి వెటకారం ముమ్మరంగా ఉన్నట్లు అందరూ అనుకున్నారు కాని వజ్రయ్య అనుకోలేదు. తృప్తిగా 'హు'అన్నాడు.

"రా బావా. స్నాతకం ఆగిపోయింది. వర్జ్యం వచ్చేస్తోందని బ్రహ్మగారు తొందరపడుతున్నారు" అన్నాడు రత్నాలు.

"ఇంకేం స్నాతకం. ఇంకో అయిదు నిమిషాల్లో వర్జ్యం వచ్చేస్తుంది" అన్నాడు వజ్రయ్య. వజ్రయ్యకు అది తెలిసే అటక ఎక్కుట. ఎలాగో వర్జ్యం వచ్చేదాక ఆలస్యం చేస్తే, తర్వాత ఆలస్యం అదే చేస్తుంది. ఈలోగా తను మరో ఎత్తు వేయచ్చు. అంచేత విడిదికి వెంటనే కదిలాడు.

ఈ పెళ్ళి జరగడం వజ్రయ్యకు ఇష్టం లేదు. కాని దగ్గర సంబంధం—'కట్నంకోసం మేనరికాన్ని తన్నుకున్నాడు' అని వాదు పడడమూ ఇష్టంలేదు. అదీ కాకుండా ఒప్పుకోవాల్సిందే అని అన్నగారు పట్టుపట్టాడు. కట్నం కోసం పినవాళ్ళను దూరం చేసుకుంటావా అన్నాడు. తనకే కొడుకుంటే తనే ఈ సంబంధం కలుపుకునేవాడు కదా అని వాపోయాడు. వజ్రయ్య ఎంతకూ లొంగక పోతే 'వెధవా తంతాను. వేషె లేశావంటే' అన్నాడు. ఆ మంత్రం బాగా పని చేసింది. వజ్రయ్యకు అన్నచేత దెబ్బలు తినడం చిన్నప్పటి రివాజా. బాల్యం గడిచి నలభై ఏళ్ళు దాటినా అన్నగారంటే జంకు చెక్కు చెదరలేదు.

అంచేత వజ్రయ్య బావమరిది కూతుర్ని తన కొడుక్కు చేసుకోడానికి ఒప్పుకున్నాడు. కాని ఇష్టంలేదు. తాంబూలాలు ఇచ్చే టైముకు ఎక్కడికైనా ఉడాయించా లనుకున్నాడు. కాని బంగారం ముందే జాగ్రత్తపడి (పొలిమేరల్లో మనుషుల్ని కాపలా పెట్టి) అది సాగనీయలేదు.


తాంబూలాలు ఇచ్చేశారు. హమ్మయ్య అనుకున్నారు. వధువు కనకం, వరుడు కాసులు మురిసిపోయారు. రత్నాలు భార్య మాణిక్యం ఆనందానికి అంతే లేదు.

వజ్రయ్య మాత్రం కుమిలి పోసాగాడు. ఆ దిగులుతో పరధ్యానం ఎక్కువై భోజనం చేయడం మొదలుపెట్టి గంటల తరబడి తింటూనే ఉండిపోయేవాడు. అలాగే ఎవరేనా ఇంటికొస్తే 'కూర్చోండి' అనడం కూడా మరిచిపోయేవాడు. ముఖ్యంగా రత్నం కనిపిస్తే గుర్తు పట్టలేకపోయేవాడు.

చివరికి ఒక పక్క పీకుతున్నా పెద్దల ఆసరా చూసుకుని పెళ్ళికి ముహూర్తం పెట్టించాడు రత్నాలు. వజ్రయ్య పెళ్ళాం మొహం చూసేనా సరిగ్గా ఉండడా అనుకున్నాడు. 'ఆ లోకం లేదూ. ఏదైనా కానిపని చేసి తలెత్తుకు తిరగ్గలడూ' అని ధైర్యం చెప్పుకున్నాడు. అయితే తలెత్తుకు తిరగడం వజ్రయ్య ఆదర్శం కాదు. అతను తల వంచుకునే వారాల తరబడి తిరగ్గలడు. అందుకే అత నిప్పుడు అటకెక్కి చీకట్లో ఒదిగి కూర్చోగలిగాడు.

తాంబూలాలు ఇచ్చాక కూడా కొడుక్కు ఏమీ సంబంధం కుదరనట్టే మాట్లాడేవాడు వజ్రయ్య. "మా వాడికి సంబంధా లొస్తున్నాయి. ఇప్పట్లో చెయ్యం" అన్నాట్ట ధన గుప్తుడు ఏవో పాత బాకీలకోసం వెళ్ళితే. "ఇదేమిటండీ. మేనరికం ఖాయం చేసుకుని!' అని అతనంటే 'తాంబూలాలు ఇచ్చారు అంతేగా' అన్నాట్ట వజ్రయ్య.

ఆ సంగతులు తెలిసి రత్నాలు గుండెల్లో రాళ్ళు పడ్డాయి. ఇప్పుడు వజ్రయ్య మాయమవడంతో అతను ఆశ వదులుకున్నాడు. వజ్రయ్య అటక దిగి స్నాతకానికి సిద్ధమవడం చూసి కోలుకున్నాడు. పాపం అతనికి వజ్రయ్య



**కాయారోహణస్వామి దేవాలయ గోపురం**

**ఫోటో—ఎన్. రామకృష్ణ (మాయురమ్)**



కంచి శివాలయ చిత్రము — చిత్రం : ఎ. గోవిందరాజులు

ప్లాన్ కాస్త కూడా తెలీదు. వజ్రయ్య కోరిన వర్జ్యం వచ్చేసింది. అతను నిస్సహాయంగా చేతులు చాపి 'వర్జ్యం వెళ్ళనిండి' అని, 'ఏడు గంటల బండి ఎన్నింటికి?' అని పక్కనున్న ఎవరితోనో గుస గుసలు మొదలెట్టాడు.

గిరి ఈ నాటకాన్ని చూసి అంతా గ్రహించి 'లే బాబాయ్! పట్టు పంచె కట్టుకురా పీటలమీద కూర్చోవాలి' అని పిలిచాడు. వజ్రయ్య 'వర్జ్యం వచ్చేసిందిరా. అదెలాగ' అన్నాడు. 'ఇంకా రెండు గంటలు వ్యవధి ఉందిరా' అని తొందరపెట్టాడు గిరి. పురోహితుడు కూడా వచ్చి 'రండి బాబూ. తప్పు చూశాను ఇందాకా. ఇప్పుడు కాదు వర్జ్యం' అన్నాడు. ఇదంతా గిరే చేశాడు. వాళ్ళు వాడుతున్న పంచాంగంలో వర్జ్యం గం 9—21 లకు అని ఉంటే గిరి అది దాచేసి, వర్జ్యం గం 11—30 లకు ఉన్న పంచాంగం తెచ్చి ముందు పడేశాడు. ఈ కుట్రలో పురోహితుడి సంపూర్ణ సహకారం లభించింది.

కిమ్మనకుండా వెళ్ళి స్నాతకం కానిచ్చాడు వజ్రయ్య. 'లగ్నం వేళకు మరేదో గొడవ చేయిస్తాలే' అని విచారాన్ని దిగమింగుకున్నాడు.

గిరి రత్నాలుతో మాట్లాడ్డానికి వెళ్ళాడు. ఓ అరగంట మాట్లాడాక 'అదీ మావయ్య మనుషులు వాళ్ళెవరో తెలీదన్నట్లు ఉండు. భోజనాలకు పిలవకు. నువ్వు మీ అమ్మాయిని నా కిచ్చి ఇదే ముహూర్తంలో పెళ్ళి చేస్తున్నట్లు అందరికీ తెలిసేలా చేస్తాను. అప్పుడు చూద్దాం' అన్నాడు గిరి.

చీకటి పడుతోంది. తమను ఈ పెళ్ళి సవ్యంగా జరపమని బతిమాలేందుకు రత్నాలు వస్తాడు అని వజ్రయ్య ధీమాగా ఉన్నాడు. అతనికి ఆ విషయంలో అనుమానమే లేదు. తను అట కెక్కి అందర్నీ ఓపూపు పూపాడు. కావా? కాని రత్నాలు ఎందుకో అటు రాలేదు. మగ పెళ్ళివారు కాఫీలు, బీడీలు కావాలని కబురు పంపితే ఎవరూ అక్కడ వినిపించుకోనే లేదు. కాఫీ ఇచ్చే హోటలూ, బీడీలు అమ్మే షాపులూ ఎక్కడ ఉన్నాయో అడ్రసులు మాత్రం ఇచ్చారు. అనుకున్నట్లు రత్నాలు రాకపోవడంతో వజ్రయ్య తన యావదాస్తీ పోయినట్లు దిగాలు పడిపోయాడు.

విడిదిలో గుసగుసలు బయల్దేరాయి— 'ఇందాకా ఏగిరి అట కెక్కలేదూ. ఓ బుష్ కోటూ వాడూను. వాడికిట' చివరికి వజ్రయ్యకే ఆ సంగతి తెలిసింది. రత్నాలు కూతుర్ని వజ్రయ్య కొడుక్కి ఇవ్వటం లేదనీ, గిరి అనే దూరపు బంధువుకు ఇదే ముహూర్తంలో ఇచ్చి చేస్తాడనీ.

బంగారం వచ్చి తమ్ముడి పక్కన కూర్చున్నాడు. ఇద్దరూ చిన్నప్పుడు అల్లరిచేసి తల్లి చేత దెబ్బలు తిని అలాగే కూర్చునేవారు. ఆ జ్ఞాపకాలు తరుముతూ వచ్చాయి వజ్రయ్యకు.

రత్నాలు తనకు ఎంత అవమానం చేస్తున్నాడు. తన కొడుక్కేం కొదవ? చిన్నగాక ఈవేళ పెళ్ళి చూసి పోదామని వచ్చిన గిరికి తీసిపోయాడా?......అలా సాగింది వజ్రయ్య ఆలోచన. అతను ఉద్రేకంగా లేచి 'వాడికిదేం బుద్ధిరా అన్నయ్యా. ఆ గిరిగాడి కేముందనీ. వాడి చొక్కా చూడు మోకాళ్ళదాకా కూడా దిగలేదు......' అన్నాడు. 'న్యాయం లేదా? పెద్ద మనుషులు లేరా?' అన్నాడు.

బంగారం నిట్టూర్చాడు. వజ్రయ్య అట కెక్కడం మొదలు జరుగుతున్న తతంగం యావత్తూ అతనికి చిరాగ్గా ఉంది.

భోజనాల వేళైంది. పిలుపు రాలేదు. పిల్లలు ఆకలితో రాగాలు మొదలెట్టారు. కొందరు చివాట్లు దెబ్బలు కడుపునిండా తిని నిద్రపోయారు. పెళ్ళివారి విడిది పొగలో ఇరుక్కున్న తేనెపట్టులా ఉక్కిరి బిక్కిరైంది.

బంగారం, వజ్రయ్య పెద్ద మనుషుల్ని తీసుకుని వెళ్ళారు. రత్నాల్ని చివాట్లు వేసే శుభ సమయం ఇన్నాళ్ళ కొచ్చిందని పెద్దలు హుషారుగా ఉన్నారు.

'ఏరా రత్నం. ఇన్నేళ్ళొచ్చి ఇదేం తుంటరి పనిరా. చెల్లెలి కొడుకును చేసుకుంటానని ఇప్పుడు మరొకడి కిస్తావా? మంచి మర్యాదా లేవూ' అన్నారు మెట్లెక్కుతూనే. రత్నాలు కంగారు పడ్డాడు. 'రండి కూర్చోండి' అని మన్నించాడు.

పెద్ద మనుషులు నలుగురూ నాలుగూ అన్నారు. రత్నాలు కృతజ్ఞతతో స్వీకరించాడు. 'చిత్తం' అన్నాడు. 'మా అల్లుడి యోగ్యత చూస్తే మీరలా అనరు' అన్నాడు. 'ఏం కాసులుకు తక్కువ. బి. ఏ. పాసయ్యాడు. వాడి వాటాకు ముప్పై ఎకరాలు ఉంది. తల్లీ తండ్రీ బావున్నారు. ఆ గిరి గాడికి ఏముంది.....ఏముందిరా' అని రెట్టించారు పెద్దలు. 'చెప్తానుండండి. గిరికి బుష్ కోటు ఉంది చూశారూ. అలాంటిది ఉంటుందని కూడా తెలీదు మా కాసులుకు' అన్నాడు.

అది విని పెద్దలు తెల్లబోయారు. మళ్ళీ మాట్లాడలేదు వాళ్ళు. ఏం చెప్తారు? కాసులుకు బుష్ కోట్ సంగతి నిజంగానే తెలీదు.

అందర్లోకీ తెలివైన వరహాలు మాత్రం గంట తీవ్రంగా ఆలోచించి 'నిజమే అనుకో అయితే నేం? నువ్వు కాసులుకు తాంబూలాలు ఇచ్చేశావుగా' అన్నాడు. రత్నం వెంటనే చిరునవ్వుతో 'నిజమే' అని ఒప్పేసుకుని పిల్లను కాసులకే ఇవ్వడానికి అంగీకరించాడు.

తన పరువూ కొడుకు పరువూ నిలిచిందని వజ్రయ్య మురిసిపోయాడు. ★